తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఉపాధి పనుల్లో...కోట్ల రూపాయల గోల్‌మాల్!

**-డ్వామా పిడిని చుట్టుముట్టిన అధికార పార్టీ నేతలు-బహిరంగ సభ వాయిదా !!**


డ్వామా పిడిని నిలదీస్తున్న తెదేపా నేతలు

శాంతిపురం, డిసెంబర్ 5 ప్రభాతవార్త : శాంతిపురం మండలం లో 2023- 24సం॥లో దాదాపు 8.50కోట్ల వ్యయంతో ఉపాధిహామీ పనులు చేపట్టారని అందులో భారీగా గోల్‌మాల్ జరిగిందని పూర్తిస్థాయిలో గ్రామాల్లో పనులు పరిశీలించాలని అధికార తెలుగుదేశం పార్టీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం మండల కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభను ప్రారంభించారు. అయితే ఈ సభకు ఉపాధి కూలీలు ఎవరూ రాలేదు. గతంలో డివిఒ శివయ్య అప్పటి అధికారపార్టీ నేతల మాటలువిని సంబంధం లేని వారిని సైతం సస్పెండ్ చేయించార న్నారు. అంతలో పిడి రవికుమార్ రావడంతో తెదేపా నేతలు ఆయనను చుట్టుముట్టారు. అయితే సభ నిర్వహిస్తామని పిడి పేర్కొనడంతో దేశం నేతలు, స్థానిక ప్రజలు సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు సమాచారాన్ని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు ఫోన్‌లో వివరించారు. ఉపాధి పనుల తనిఖీలకు వచ్చిన బృందం సైతం చేతివాటాన్ని ప్రదర్శించడంతో పాటు గ్రామాల్లో రైతులకు, కూలీలకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. గ్రామాల్లో దండోరాలు వేయించి సామాజిక తనిఖీలు నిర్వహించేలా చూడాలని కోరారు. ఎపిడి వెంకటరత్నంపై కొంతమంది తిరగబడ్డారు. ఎప్పుడూ వందల సంఖ్యలో వచ్చే కూలీలు సైతం రాకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఆడిట్ సిబ్బంది రూముల్లో కూర్చుని ఆడిట్ చేశారని ధ్వజమెత్తారు. చివరకు పిడి రవికుమార్ బహిరంగ సభ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, ఉయ్యాల జయరాంరెడ్డి, దేశం నేతలు పాల్గొన్నారు.

# పిఎస్‌ఎల్‌వి-సి59 ప్రయోగం...
# షార్‌లో హుషార్

**-ఒక్కరోజు ఆలస్యమైనా గురిచూసి ప్రయోగించిన ఇస్రో**
**-ప్రోబా3 క్షేమంగా భరిభ్రమిస్తోంది : ఈశా శాస్త్రవేత్త జోసఫ్**
**-ఖచ్చితమైన కక్ష్యలో ప్రవేశపెట్టాం : ఇస్రో ఛైర్మన్ సోమనాథ్**
**-ఇస్రో బృందాన్ని అభినందిస్తున్న ప్రధాని, పలువురు ప్రముఖులు**


రివ్వున దూసుకెళ్ళిన పిఎస్ఎల్-సి59 రాకెట్


అంతరిక్షంలో రాకెట్ నుండి విడిపోయిన ప్రోబార్3 ఉపగ్రహాలు

శ్రీహరికోట (తడ), డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీహరికోట మరోసారి విజయాల బాటగా నిరూపించుకుంది. అంతరిక్షంలోకి పిఎస్‌ఎల్‌వి-సి59 రాకెట్ గురి తప్పకుండా ప్రవేశించింది. బుధవారం సాయంత్రం జరగాల్సిన ఈ ప్రయోగం ఒకరోజు ఆలస్యంగా గురువారం జరిపారు. యూరోపియన్ శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రోబా3 శ్రేణిలో రెండు ఉపగ్రహాలను మన రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. ముందురోజు ఉపగ్రహంలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా వాయిదా వేశారు. గురువారం ఉదయం శాస్త్రవేత్తలు లోపాన్ని సరిదిద్ది మళ్లీ కౌంట్‌డౌన్ ప్రారంభించి, రాకెట్ ప్రయోగానికి సిద్ధం చేశారు. దీనికి తోడు గురువారం శ్రీహరికోట పరిసర ప్రాంతాల్లో వాతావరణం కూడా అనుకూలించింది. ముందురోజులాగా వర్షం కురవలేదు. సమీప ప్రాంతాల నుంచి రాకెట్ ప్రయోగ వీక్షణ కోసం సందర్శకులు తరలివచ్చారు. ఇక్కడి గ్యాలరీ నుంచి పిల్లలు, పెద్దలు రాకెట్ ప్రయోగాన్ని అనుకూల వాతావరణంలో వీక్షించారు. ఎక్కువ దూరం రాకెట్ ప్రయాణం కనిపించడం వలన వీక్షకుల గ్యాలరీ, చప్పట్లు కేరింతలతో నిండిపోయింది. ఇదిలావుంటే మిషన్


రాకెట్ ప్రయోగం విజయం అనంతరం మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్

కంట్రోల్ సెంటర్లో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు యూరోపియన్ స్పేస్ ఏజన్సీకి చెందిన శాస్త్రవేత్తలు నిండుగా కనిపించారు. యూరోపియన్‌లలో ఎక్కువమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నారు. వీరంతా గంటకు పైగా మిషన్ కంట్రోల్ సెంటర్లో రాకెట్ ప్రయోగాన్ని పెద్ద తెరలపై వీక్షించడానికి ఉత్సాహపడ్డారు. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్, ఒకవైపు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, మరోవైపు మిషన్ డైరెక్టర్ ఎం.జయ కుమార్‌లతో హుషారుగా మాట్లాడుతూ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు.

**ఇస్రోకు వాణిజ్య పంట:**

పిఎస్‌ఎల్‌వి-సి59 ద్వారా యూరోపియన్ ఉపగ్రహాలు ప్రయోగించడం వలన భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు శ్రీహరికోట మరోసారి వాణిజ్య పంటగా మారింది. ఇటీవల ఇక్కడ పెద్ద రాకెట్ ప్రయోగాలు జరిగి చాలా కాలమైంది. స్మాల్‌శాటిలైట్ లాంచ్ వెహికల్‌ను ఆగస్టు 16న ప్రయోగించిన తర్వాత మళ్లీ రాకెట్ ప్రయోగం జరగలేదు. మార్క్3, జీఎస్‌ఎల్‌వి, పిఎస్‌ఎల్‌వి ప్రయోగాలు మరిన్ని జరపడానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఎప్పుడైనా స్వదేశీ ఉపగ్రహాలతో పాటు కొన్ని చిన్న దేశాలకు చెందిన ఉపగ్రహాలను ప్రయోగిస్తూ కమర్షియల్‌గా ఆదాయం పొందే ఇస్రో ఈసారి ఏకంగా 550 కిలోల బరువు ఉన్న విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం వలన ఎక్కువ వాణిజ్య లాభాలు ఆర్జించినట్లు తెలుస్తోంది. ఈ ప్రయోగం అత్యంత గఘన విజయం సాధించడం తో భవిష్యత్‌లో మరిన్ని దేశాలు మన ఇస్రో రాకెట్లపై ఆధారపడతాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రయోగ విజయం తర్వాత ఛైర్మన్ ఎస్.సోమనాథ్ మాట్లాడుతూ ఈ ప్రయోగం ఖచ్చితమైన ఆర్బిట్‌కు ఉపగ్రహాన్ని చేర్చడంతో పూర్తి స్థాయి విజయం సాధించిందని పేర్కొన్నారు. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో 61వ ప్రయోగాన్ని జరిపామని, ఎన్‌ఎస్‌ఐఎల్ వారి పూర్తి సహకారం ఉందన్నారు. అంతరిక్షంలో 60వేల కిలోమీటర్ల ఎత్తులో ఒక ఉపగ్రహాన్ని చేర్చడం కూడా ఇస్రోకు ఇది తొలి సారి అని చెప్పారు. మిషన్ డైరెక్టర్ జయకుమార్ మాట్లాడుతూ ఆరు స్ట్రాపాన్ బూస్టర్లతో నిర్మించిన ఈ ఎక్స్‌ఎల్ ప్రయోగం తమకు ఎంతో హుషారు నిచ్చిందని అన్నారు. అక్టోబర్ 3న ప్రయోగ సన్నాహాలు ప్రారంభించామని, రెండు నెలలుగా ఇస్రో బృందం ఈ ప్రయోగానికి కష్టపడిందని చెప్పారు. ఎన్‌ఎస్‌ఐఎల్ డైరెక్టర్ డి.రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఈసా బృందంతో పాటు ఇస్రో టీమ్ కూడా స్ట్రాంగ్ సైన్స్ టీమ్‌గా ఏర్పడి ఈ విజయానికి కారణమయిందన్నారు. సూర్యుడి ఉపరితలంపై పరిశోధనల కోసం ఉపగ్రహాలు ఎంతో ఉపయోగపడ తాయని, అదేవిధంగా ఇస్రోకు భవిష్యత్‌లో మరిన్ని విభిన్న ప్రయోగాలు చేసేందుకు అవకాశం లభించిందని చెప్పారు.

**శ్రీహరికోటలో పటిష్టమైన బందోబస్తు :**

బుధ, గురువారాలలో శ్రీహరికోట అటు సిఐఎస్‌ఎఫ్ దళాలు, ఇటు పోలీసు బలగాలతో నిండిపోయింది. బుధవారం జరగాల్సిన ప్రయోగం గురువారానికి వాయిదాపడిన నేపథ్యంలో రెండురోజుల పాటు ఇక్కడ పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టారు. విదేశీ ఉపగ్రహాల ప్రయోగం, విదేశీ శాస్త్రవేత్తలు షార్‌లోనే ఉండటంతో భద్రతను పెంచారు. షార్ అడవుల్లో కూంబింగ్ నిర్వహించారు. సూళ్లూరుపేట-శ్రీహరికోట మార్గంతో పాటు పులికాట్ దీవుల రోడ్లపైన కూడా బందోబస్తు చేపట్టారు. రాకెట్ ప్రయోగాన్ని తిలకించేందుకు శ్రీహరికోటకు వచ్చిన సందర్శకులు ఆ ప్రాంతంలోని పులికాట్ సరస్సులో ఉన్న విదేశీ పక్షులను వీక్షించడానికి ఉత్సాహపడ్డారు. ఈ కారణంగా పలు వ్యూపాయింట్లు సందర్శకులతో నిండిపోయాయి.

# వైభవంగా రథోత్సవం

**అశ్వ వాహనంపై కల్కి అవతారం అలివేలు మంగమ్మ**



ఆశ్వ వాహనంపై భక్తులను అనుగ్రహించిన పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : తిరుచానూరు పురవీధులలో అశ్వంపై అధిరోహించి కల్కి అవతారంలో అలివేలు మంగమ్మ భక్తులకు అభయమిచ్చారు. పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజైన గురువారం పద్మావతిదేవి ఆశ్వ వాహనంపై భక్తులను అనుగ్రహించారి. ఇందులో భాగంగా ఉదయాన్నే సుప్రభాతంతో అమ్మవారిని మేలుకొలిపి సహస్రనామార్చన నిత్యార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపం వద్ద స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. తరువాత అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనతరం అశ్వవాహనంపై పద్మావతి అమ్మవారిని కొలువు దీర్చారు. పుర వీధుల్లో దీపకాంతుల నడుమ ఊరేగుతూ భక్తులకు అనుగ్రహించారు. కర్పూర నీరాజనాలతో భక్తులు అమ్మవారికి కృపాకటాక్షాలకు పాత్రులైనారు. అంతక ముందుగా ఉదయం రథోత్సవం వైభవంగ సాగింది. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగి అమ్మవారి అనుగ్రహాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బిఆర్ నాయుడు, తిరుపతి ఎస్పి సుబ్బరాయుడు తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఈవో జె.శ్యామలరావు, జేఈవో వీర బ్రహ్మం, ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, సిఈ సత్యనారాయణ, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సుభాష్ ,చలపతి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# వర్గీకరణతో చిచ్చు పెడుతున్నారు

**మాల మహాగర్జనను జయప్రదం చేయండి**



గూడూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : సుప్రీంకోర్టు నిర్ణయం మాలలకు విషధాకరమైన వార్త అని ఇందుకు నిరసనగా డిసెంబర్ 15వ తేదీన గుంటూరు లో హలో మాల, చేలో గుంటూరు మాల మహాగర్జన సభను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆయన మాట్లాడుతూ 2004 ఒకసారి వర్గీకరణ చేయగా, సుప్రీంకోర్టులో వర్గీకరణకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని, అప్పట్లో మాలలు అనేకమంది ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయారు, ఉద్యోగులు కొల్పోయారన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయంను మేము వ్యతిరేకిస్తున్నాం, అసంపూర్ణ మైన తీర్పు సుప్రీంకోర్టు ఇచ్చిందన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే వర్గీకరణ చెయ్యాలన్నారు. మందా కృష్ణ మాదిగ మందబుద్ధితో ఇక్కడ వర్గీకరణ చిచ్చు పెడుతున్నాడు, మాకు మాల మాదిగకు తేడాలులేవు, మేము ఐక్యంగా ఉండలనుకుంటున్నామన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడైనా మా మాల సంఘాలతో సమీక్షించారా, ఇప్పుడు ఎందుకు కమిషన్ వేశారు, ఎట్టి పరిస్థితుల్లోనూ వర్గికరణ జరగదన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్షులు తుళ్ళిబిల్లి అశోక్ బాబు, దాసరి సుందరం, గూడూరు డివిజన్ జెఎసి అధ్యక్షులు మీజూరు మాధవ్, జెఎసి సభ్యులు గిద్దలూరు రఘు, దాసరి అశోక్(ఎల్ ఎల్ బి), జెఎసి సభ్యులు బళ్ల హరి, నెల్లూరు జిల్లా ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షులు కర్లపూడి వెంకటరమణయ్య, కేశవ, పాల మల్లికార్జున, దార్ల ఏడుకొండలు, శివ ప్రసాద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్**


ఇండోర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : తిరుపతి నగర ప్రజలందరికి మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకొని రావడం జరిగిందని, నగర ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక ఇందిరా మైదానం నందు ఇండోర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, రవినాయుడుతో కలిసి జిల్లా కలెక్టర్ శిలాఫలకం గావించి కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగర ప్రజలందరికి కోసం మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. సుమారు రూ. 8.80 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మించడం జరిగిందన్నారు. ప్రజలకు క్రీడాకారులకు పలు రకాల క్రీడలను అందుబాటులోకి తీసుకొని రానున్నామని శుభ పరిణామమని తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియం నందు బాస్కెట్ బాల్, వాలీబాల్ షటిల్ వంటి క్రీడలతో పాటు ఇండోర్ క్రీడలు అందుబాటు లోకి వచ్చాయని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్ నందు రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఉంటాయని అన్నారు, మొదటి అంతస్తు నందు రెండు టేబుల్ టెన్నిస్ కోర్టులు, రెండు క్యారమ్ బోర్డులు, ఒక ఎయిర్ హాకీ, ఒక పూల్ టేబుల్ కోర్టులు, రెండవ అంతస్తులో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను శాసనసభ్యులు, శాప్ ఛైర్మన్, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈరోజు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. నిరంతరాయంగా తిరుపతి ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు ఎల్లప్పుడూ క్రీడలు నిర్వహణ జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించే దశగా మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను తిరుపతి ప్రజలకు అందరికీ అందుబాటులోకి తీసుకొని రావడం జరిగింది అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో తిరుపతి ఆధ్యాత్మిక నగరానికి స్మార్ట్ చేసిన తీసుకుని రావడం జరిగిందని తెలిపారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో బాస్కెట్ బాల్, టెన్నిస్, వాల్ బాల్ వంటి వంటి ఆటలను క్రీడాకారులకి అందుబాటులోకి తీసుకొని రావడం జరిగింది అని తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి అభివృద్ధి పనులు, మున్సిపల్ నిధులతో తిరుపతి నగరలో గుంతలు లేని రోడ్ల లేని పనులను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాంధ్ర ప్రదేశ్‌గా మార్చాలని సంకల్పంతో ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకం గా దృఢంగా ఉండాలంటే క్రీడల ఎంతో ముఖ్యమని వీటిపై ఆసక్తి చూపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయంతో నేడు తిరుపతి లోని క్రీడాకారులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈరోజు మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే తో కలిసి వాలీబాల్, టెన్నిస్ ఆడి అందరిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష్, స్మార్ట్ సిటీ మేనేజర్ చంద్రమౌళి, మాజీ శాసన సభ్యురాలు సుగుణమ్మ, టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి రెవెన్యూ సదస్సులు

**- భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత - రేపు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్**
**- విద్యార్థుల తల్లిదండ్రుల నుండి సలహాలు, సూచనలు స్వీకరణ- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుండి జనవరి 8వ తేదీ వరకు 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ రెవెన్యూ సదస్సులు, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, ఈ కార్యక్రమంలో భాగంగా తహసిల్దార్లు, డిప్యుటీ తహసిల్దార్లు, విఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు రోజుకు ఒక గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు దారి సమస్యలు, భూసమస్యలు, రీ-సర్వే సమస్యలు, జాయింట్ అకౌంట్ సమస్యలు, డికెటి, ఎన్‌హెచ్ సమస్యలకు సంబంధించి వినతులు సమర్పించుకోవచ్చు నన్నారు. రెవెన్యూ సదస్సులు పూర్తయిన 45 రోజుల్లోపు సమస్య పరిష్కరించబడుతుందన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ షెడ్యూల్ వివరాలు ప్రజా ప్రతినిధులకు పంపడం జరిగిందని, ప్రజా ప్రతినిధులు సైతం ఈ కార్యక్రమలో పాల్గొంటారన్నారు.

**రేపు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ :**

జిల్లా వ్యాప్తంగా శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో తోడ్పతుందన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడానికి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో శనివారం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొనాలని కలెక్టర్ కోరారు. విద్యార్థుల ప్రొగ్రెస్ కార్డులు, ఆరోగ్య స్థితిగతులకు సంబంధించిన వివరాలను కార్డుల రూపంలో అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**సమన్వయంతో విజయవంతంగా సదస్సుల నిర్వహణ**
**- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్**


సదస్సుల నిర్వహణ విధి విధానాలపై మాట్లాడుతున్న డిఆర్‌ఓ

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుండి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ విధి విధానాలకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో రిజిస్ట్రేషన్, సర్వే, అటవీ, దేవాదాయ శాఖ అధికారులతో డిఆర్‌ఓ మోహన్ కుమార్ సమావేశం నిర్వహించారు. అర్డీఓలు వారి పరిధిలో వున్న మండలాల్లో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను ప్రజా ప్రతినిధులు, ఎన్జీఓలకు సమాచారం అందించాలన్నారు. తహసిల్దారు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, సంబంధిత గ్రామాల విఆర్‌ఓ, మండల సర్వేయర్, రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిధి, అవసరమైన చోట్ల అటవీ, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు సిబ్బందితో కూడిన అధికార బృందాలు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఎం.శంకరయ్య, సర్వేయర్ శాఖ ఎడి జయరాజ్, వక్ఫ్‌బోర్డు అధికారి గౌర్ మొహిద్దీన్, అటవీశాఖ అధికారి ముంతాజ్, దేవాదాయశాఖ అధికారి చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన పంటపొలాలు-వర్షంలోను వరినాట్లు




తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : ఫెంగాన్ తుఫాను ప్రభావం మండలంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని చెప్పవచ్చును. మండలంలో గురువారం మండలంలో 49.0 మి.మీ వర్షపాతం నమోదైందని చెప్పవచ్చును. మంగళవారం రాత్రి నుంచి వర్షం తెరపించినా బుధవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి మండల తహశీల్దార్ కార్యాలయం ఉరుస్తున్నా కూడా సిబ్బంది పనిచేస్తున్నారు. కాగా ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో మండలంలో వరి, వేరుశనగ పంటలును వేస్తున్నారు. ఇక అన్ని పంటలు కలిపి 4653హెక్టార్లలో వేస్తారని వ్యవసాయాధికారులు తెలిపారు. ఇక మండలంలోని చిట్టత్తూరు, కొత్తకండ్రిగ, బోనుపల్లి, కంచనపల్లి, పెద్దకనపర్తి, చిన్నకనపర్తి, పెద్దకన్నలి, పిల్లమేడు, చిన్నకనపర్తి, రౌతు సూరమాల, లక్ష్మిపురం గ్రామాల్లో రైతులు వేసిన పంటలు వర్షపునీటితో నీటమునిగాయి. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు నీటిపాలైందని చెప్పవచ్చును. ఓవైపు జోరున వర్షం వస్తున్నా వ్యవసాయ కూలీలు వర్షంలోనే వరినార్లు సిద్దం ఇక చిట్టత్తూరు చెరువు కూడా పూర్తిస్థాయిలోనిండిండి కలుజుపారుతోంది. ఓవైపు దళితవాడల్లో దయనీయ పరిస్థితి ఏర్పడింది. కూలిపనులు చేసుకుని కడుపు నింపుకునే వారు లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వారికి ఎవరైనా భోజన సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇక పంటపొలాలు ఎక్కడ చూసినా చెరువులును తలపిస్తున్నాయి. వర్షం తగ్గుముఖం తగ్గిన తర్వాత పంటనష్టాన్ని అంచనా వేయాలని పలువురు కోరుతున్నారు. ఇక మరికొందరు అన్నదాతలు వేసిన వరినార్లు నీటమునిపోయాయి. ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు వర్షం పడుతూనే ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇక గురువారం ఉదయం నుంచి వరుణుడు కరుణించాడని చెప్పవచ్చును.

# వైద్య పరిశోధనలపై...పరస్పర ఒప్పందం



తిరుపతి హెల్త్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఎస్‌వి వైద్య కళాశాల పరిశోధనలపై పరస్పర ఒప్పందాన్ని నేడు ఎస్‌వి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఎ.చంద్రశేఖరన్, సైన్స్ అండ్ సోషల్ సైన్స్‌లో వైద్య పరిశోధనల కొరకు ఎస్వీ విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకోవడం జరిగినది. ఎస్వీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ వైద్య పరిశోధనలో వస్తున్న పలు మార్పులను పరిశోధించుట కొరకు ఇటు సైన్స్ అండ్ సోషల్ సైన్స్ ఎస్.వి .విశ్వవిద్యాలయం మరియు ఎస్ వి వైద్య కళాశాల పరస్పర ఒప్పందం 60 ఏళ్ల చరిత్రలో ఇదే మొదటిసారి, ఈ ఒప్పందం వలన విశ్వవిద్యాలయం విద్యార్థులకు, వైద్య విద్యార్థులకు ఎంతో అనువైన, పరిశోధనలు చేసు కొనుట కొరకు ఇలాంటి ఒప్పందం ఎంతో ముఖ్యమైన ఘటమని తెలిపారు. ఈ యొక్క పరిశోధనలను, వైద్యులు, వైద్య విద్యార్థులు ఎస్వీ విశ్వవిద్యాలయం రీసెర్చ్ లాబరేటరీల్ని ఉపయోగించుకొనుటకు ఎంతో అణువుగా ఉంటుందని, ఉత్తమమైన వైద్య ఫలితాలు కూడా సాధించవచ్చునని, క్యాన్సరు, కొన్ని అంతు పట్టలేని వ్యాధుల ను కనుగొనుటకు , ఈ యొక్క విశ్వవిద్యాలయం రీసెర్చ్ ల్యాబ్‌లు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. రిజిస్టర్ డాక్టర్ భూపాల్ నాయుడు మాట్లాడుతూ ఇలాంటి ఒప్పందాలు వలన, ఎస్వీ విశ్వవిద్యాలయం ఎస్ వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు, సైన్స్ అండ్ సోషల్ సైన్స్ విద్యార్థిని విద్యార్థులకు, పరిశోధనాపై మంచి పట్టు సాధించుటకు ఇలాంటి ఒప్పందాలు ఎంతైనా అవసరం. ఇలాంటి ఉత్తమమైన పరిశోధనలు చేసుకున్నట్లయితే ఎస్‌వి విశ్వవిద్యాలయం విద్యార్థులకు, ఎస్‌వి వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. అప్పుడే మనము ప్రగతి పదములో ముందడుగు వేయవచ్చును అని ఆయన తెలిపారు. పరస్పర ఒప్పంద పత్రాలు మార్చుకున్న తర్వాత ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఎస్వీ విశ్వవిద్యాలయం, మరియు ఎస్ వి వైద్య కళాశాల చరిత్రలో ఇది ఒక ముఖ్య ఘటం అని తెలిపారు. రుయా ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్, డాక్టర్ పార్థసారధిరెడ్డి, డాక్టర్ బాలాజీ, ఎస్వీ విశ్వవిద్యాలయం (డిన్) పరి పాలన, ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డిఎస్ ఎన్ మూర్తి, మరియు ఎస్వీ వైద్య కళాశాల పి.ఆర్.ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయుల వివాహానికి హాజరైన చల్లాబాబు

**పుంగనూరు,డిసెంబరు 5 ప్రభాతవార్త** : నియోజకవర్గ తెలుగుదేశం కన్వీనర్ చల్లాబాబు గురువారం తెలుగుదేశం నాయకుడు, విశ్రాంత డిఎస్పీ,రాష్ట్ర వాల్మీకి సంఘ అధ్యక్షుడు కనుమకుంట సుకుమార్‌బాబు కుమార్తె వివాహానికి ఆయన హాజరయ్యారు. వివాహమండపంలో రిసిప్షన్ సందర్భంగా జరిగే తంతులో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ప్రజాసేవతో పాటూ పుంగనూరు బసవరాజ పాఠశాల పూర్వవిద్యార్థిగా ఎన్నెన్నో సేవాకార్య క్రమాలు అందచేస్తున్న సుకుమార్‌బాబు మంచి ప్రజాదరణ కలిగిన నాయకుడని అభినందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన,బిజెపి కూటమి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## నాటుస్థావరాలపై ఎక్సైజ్ మెరుపుదాడులు



**పుంగనూరు రూరల్,డిసెంబరు 5 ప్రభాతవార్త** : మండలంలో నాటుసారా కాస్తున్న స్థావరాలపై సిఐ సురేష్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న దాడులు సారా తయారీదారులను గడగడ వణికిస్తున్నాయి. గురువారం జమ్మికుంట వద్ద దాడులు నిర్వహించి ఊటను ధ్వంసం చేశారు. ఇదే క్రమంలో చౌడేపల్లి పంపిశెట్టిపల్లి సమీపంలో దాడులు నిర్వహించి కర్నాటకమద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈదాడులలో ఒక వ్యక్తిని అరెస్టుచేశారు.

## 6 నుంచి రెవిన్యూ సదస్సులు

**పుంగనూరు రూరల్,డిసెంబరు 5 ప్రభాతవార్త** :మండలంలో శుక్రవారం ఉదయం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవినూ య్ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాము తెలిపారు. 19 రెవిన్యూ గ్రామాలలో జరిగే సదస్సులల్లో ప్రజలు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో అందించాలని కోరారు.

## సిఎంను కలసిన పిరమలైకల్లర్ రాష్ట్ర సంఘం నేతలు



**కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును పిరమలై కల్లర్ రాష్ట్ర సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ తేవర్, ఎంబిసి రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి, చిత్తూరు జిల్లా ఎంబిసి ఉపాధ్యక్షుడు, తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి శివతేవర్, రాజా, తంగపడియన్ తేవర్ తదితరులు ఈసందర్భంగా తమ సమస్యలను సిఎంకు వివరించారు. పిరమలై కల్లర్ కులం సంచార జాతుల పరిధిలో వస్తుందన్నారు. తమ కులస్తులు ఇళ్ల వద్ద తినుబండారాలు తయారు చేసి సైకిళ్లలో, టువీలర్లలో ఊరూరా తిరిగి విక్రయిస్తూ జీవనం సాగిస్తామన్నారు. అయితే ఇంతవరకు తమకు కులధృ వీకరణ పత్రాలు ఇవ్వలేదన్నారు. దీంతో ప్రభుత్వ పథకాల్లో లబ్ది పొందడం లేదని పేర్కొన్నారు. తమకు లానికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని సిఎంను కోరగా సానుకూలంగా స్పందించారు. కులసర్టిఫికెట్లు మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్నను ఆదేశించారు.

## సమాజాభివృద్ధిలో సామాజిక కార్యకర్తలు ఎంతో కీలకం

– ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : సమాజ అభివృద్ధిలో సామాజిక కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నా రు. గురువారం స్థానిక ఎన్జీఓ భవనంలో అంతర్జాతీయ సామాజిక కార్యకర్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం లాంటి గ్రామీణ ప్రాంతంలో గతంలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తలు ముందుకు వచ్చి అభివృద్ధికి తమవంతు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీఛైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, కార్మిక నేత రంగయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం పిజి సెల్వం, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎపిఫైబర్‌నెట్ ఛైర్మన్ జివిరెడ్డిని కలసిన భాగ్యలక్ష్మి త్రిలోక్

**కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : ఎపిఫైబర్‌నెట్ ఛైర్మన్ జి.విశ్వనాథరెడ్డిని కుప్పం తెలుగు మహిళ నాయకురాలు, భాగ్యలక్ష్మి కేబుల్ నెట్‌వర్క్ ఛైర్మన్ భాగ్య లక్ష్మి త్రిలోక్ గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసం దర్భంగా ఆమె కుప్పం నియోజకవర్గంలో ఎపి ఫైబర్ నెట్ వర్క్ సమస్యలు, చేపట్టాల్సి న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. నెట్‌వర్క్ లో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన ఫైబర్‌నెట్ సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివిరెడ్డి తెలిపారు.



## వ్యవసాయ విధానంలో రైతులకు ఆధునిక సాంకేతికత

– ఇండో...ఇజ్రాయిల్ ఎంబసీ ప్రతినిధి ఉరీ రూబిన్ స్టీన్



**కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : సిఎం చంద్రబా బునాయుడు సహకారంతో ఇండో- ఇ జ్రాయిల్ భాగస్వామ్యంతో ఎపిలో వ్యవసాయ విధానాల్లో రైతులకు ఆధునిక సాంకేతికత అందుబాటులో వచ్చిందని ఇండో-ఇజ్రాయిల్ ఎంబసీ ప్రతినిధి ఉరీ రూబిన్ స్టీన్ పేర్కొన్నారు. బంగానత్తంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సిఒఇ)లో జరిగిన మూడు రోజుల శిక్షణ తరగతుల అనంతరం ఆయన జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డితో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంట విధానంలో అంటుకట్టడం ద్వారా వచ్చే వంగతడాలను పొలాల్లో నాటడంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. దీంతో రైతులు ప్రతికూల వాతావరణ ం, వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల సమస్య లను అధిగమించి పంటలు అధికదిగుబడికి మెళకువలు వివరించా మన్నారు. డిహెచ్‌ఒ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రాష్ట్రంలో ఉద్యాన రైతులకు అధిక లాభాలు తెచ్చేలా కుప్పం సిఒఇలో సదస్సుకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి బ్రహ్మదేవ్, ఎడి కోటేశ్వరరావు, ఎపిఎంఐపి అధికారి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

## తహశీల్దార్ పనితీరు మార్చుకోవాలి

**వెదురుకుప్పం,డిసెంబర్ 5 ప్రభాతవార్త** : పేద ప్రజల సమస్యల పరిష్కారంలో తహశీల్దార్ అనుసరిస్తూన్న పద్ధతిని మార్చుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లె సుబ్రమణ్యం అన్నారు. తహశీల్దార్ కార్యాలయం ముందు గురువారం బాధితులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపకుండా ఆదాయ మార్గాలే పరమావధిగా పనిచేస్తూన్నారని ఆరోపించారు. మాంబేడు గ్రామంలో ఇటీవల కాలువలో దారి నిర్మాణంకు రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాం గాన్ని ఉపయోగించుకుని రోడ్డు నిర్మాణం చేపట్టిన ఆయన ఆదే గ్రామంలో కాలువలో దళితులకు దారి లేదని చేపట్టడం వివక్షకాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రామమూర్తి, రాజేంద్ర, బాలు. నాథముని, మహాలక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు ప్రత్యేక ఆయుర్వేదిక్ వైద్యశిబిరం



**చిత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** చిత్తూరు న్యూ కయనికట్టు వీధిలో సపోర్టుసంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగృహం నందు గురువారం చిత్తూ రు ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాల డాక్టర్లచే ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటు చేసినట్లు సపోర్టుసంస్థ అధ్య క్షులు జోసఫ్‌రాజు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ హరితమురళీక్రిష్ణ లక్ష్మీదేవిలు పాల్గొని నిరాశ్రయులు వైద్యచికిత్సలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేసారు. వసతిగృహ సిబ్బంది శశిరేఖ, శ్రీనివాస్‌సెల్వి తదితరులు పాల్గొన్నారు.

## సదస్సులు సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి లో భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల పరిధిలో డిసెంబరు 6వతేదీ శుక్రవారం నుంచి జనవరి 8, 2025వరకు, అర్బన్ పరిధిలో శుక్రవారం నుంచి డిసెంబరు 31వ తేదీవరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

## పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు : ఆర్డీఓ

**పలమనేరు,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తునట్లు పలమనేరు ఆర్డీఓ భవాని తెలిపారు.స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం రెవెన్యూసదస్సులను నిర్వహిస్తుందని తెలిపారు. అధికంగా భూ సమస్యలు ఉన్న ప్రాంతాలలోని రైతుల వద్ద అర్జీలు స్వీకరించి వారికి రసీదులను అందించడం జరుగుతుందని సుమారు 45 రోజులలో ఆ సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు కృషి చేయాలని సూచించారు.సదస్సులలో ఫిర్యాదు చేపట్టిన వెంటనేఅధికారులు తగు చర్యలు తీసుకుని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోండి

**పలమనేరు,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** నేటి నుండి మండలంలో జరగనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు,రైతులు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ ఇన్బనాథన్ తెలిపారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గురువారం మండలంలో రెవెన్యూ సదస్సుల వివరాలను తెలిపారు. ప్రజలు వారి సమస్య లను అర్జీల రూపంలో అందించాలని వారికి సదస్సులో అధికారులు రసీదులు అందిస్తారని 45రోజులలో ఆ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారని తెలిపారు.

## సదస్సులతో సమస్యలు పరిష్కారం కావాలి : ఎమ్మెల్యే

**పలమనేరు,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** పలమనేరు నియోజకవర్గంలో జరగనున్న రెవెన్యూ సదస్సులలో ప్రజల సమస్యలు పరిష్కారం కావాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాల యంలో గురువారం పలమనేరు ఆర్డీఓ భవాని, తహశీల్దార్ ఇన్బనాథన్‌లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సులను దిగ్వి జయంగా పూర్తి చేయాలని,రెవెన్యూ సదస్సులలో వచ్చే అర్జీలను సత్వరం పూర్తి చేయాలని సూచిం చారు.గంటావూరు,గడ్డూరు కాలనీలలో అక్రమ పట్టాల అంశంపై జరుగుతున్న విచారణ వేగవంతం చేయాలని,ఖాళీ ప్రభుత్వ స్థలాలను గుర్తించి అర్హులైన వారికి అందించేదుకు కృషి చేయాలని తెలిపారు.

## కారు ఢీ-ఒకరి మృతి!

**గంగవరం,డిసెంబర్ 5 ప్రభాతవార్త:** ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది.సిఐ ప్రసాద్ కథనం మేరకు... మొరం పంచాయతీ రాజీవ్ కాలనీకి చెందిన చంద్రశేఖర్ (58) ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుండి బెంగళూరు జాతీయ రహదారిపై వెళుతుండగా కేటిల్‌ఫామ్ సమీపంలో పలమనేరు వైపు నుండి బెంగళూరు వెళుతున్న ఓ కారు ఢీకొంది. చంద్రశేఖర్ అక్కడి కక్కడే మృతి చెందగా సిఐ ప్రసాద్ సంఘటన స్థలనికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టెంపోట్రావలర్ బోల్తా...5మందికి గాయాలు

**గంగవరం, డిసెంబర్ 5ప్రభాతవార్త:** మండలంలో ఉదయం4 గంటలకు జరిగిన ఓ ప్రమాదంలో 5 మంది మహిళలకు గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది.కర్నాటక రాష్ట్రం బెంగళూరు కేఆర్‌పురంకు చెందిన 20 మంది మహిళలు తిరుచ్చానూరు అమ్మవారి బ్రహోత్సవాలకు వెళ్లి బెంగళూరుకు తిరుగు ప్రయాణంలో గంగవరం మండలం దండపల్లె వద్ద వెనుక వైపునుండి ఓ టెంపో అతివేగంతో టెంపోట్రావలర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో వాహనం అదుపుతర్తి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న జలశ్రీ(20), అనిత (45), పూజ(17), జయంతి(30), ఘగన(19) గాయ పడ్డారు.సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ ప్రసాద్ 108 వాహనాలలో గాయపడ్డవారిని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జోనల్ క్రీడల్లో మర్రిమాకులపల్లి విద్యార్థుల ప్రతిభ



**చౌడేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : పుంగనూరు స్థాయి జోనల్ క్రీడల్లో వాలీబాల్ విభాగం నందు మర్రిమాకుపల్లి విద్యార్థులు ప్రతిభను కనబరచారు. కాగతి పంచాయతీ మర్రిమాకులపల్లి ఉన్నతపాఠశాల ఆవరణంలో నిర్వహించిన గ్రిగ్‌మెమోరియల్ టోర్నమెంటు నందు వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో 4జట్లు తలపడగా మర్రిమాకులపల్లి విద్యార్థులు మొదటి స్థానం, చంద్రమాకుల పల్లి 2వ స్థానాన్ని కైశవం చేసుకొన్నారు. అదే విధంగా జూనియర్ బాలుర విభాగంలోనూ మర్రిమాకులపల్లి విద్యార్థులు మొదటి, చంద్రమాకులపల్లి రెండస్థానంలో నిలచారు. రెండింటిలోనూ విజయం సాధించిన మర్రిమాకులపల్లి విద్యార్థులను పాఠశాల ఉపాధ్యా యులు, స్థానికులు అభినందించారు.

## పెళ్ళింట మాజీ మంత్రి పెద్దిరెడ్డి

**చౌడేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : మండల కేంద్రమైన చౌడేపల్లిలో జరిగిన పెళ్ళిళ్ళకు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. బైసాని, శ్రీలక్ష్మీశ్రీనివాసా కళ్యాణ మండపాల్లో గోసలకురపల్లి కదిరప్ప కుమారుడు సుదర్శన్, బయపల్లి అమరనాథ్, పిఎల్ కొత్తూరు లక్ష్మీపవిత్రల వివాహ మహోత్సవంలో పెద్దిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, మాజీ ఎంపిపి కూరపర్తి అంజిబాబు, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, కళ్యాణ్ భరత్, రవిచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెంగారెడ్డి, మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## నే(నీ)టి వృధా - రేపటికి వ్యధ

**చౌడేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : మండల కేంద్రమైన చౌడేపల్లిలోమంచినీరువృధాఅవుతోంది. ముఖ్యంగాసంతగేటు, బజారు వీధి తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరా చేస్తున్న సమయంలో కొళాయిల నుంచి నీరు వృధాగా పోతున్నా పట్టించుకొనే వారు కరువయ్యారు. పంచాయతీ కార్యాలయం వద్దనే పరిస్థితి ఈ విధంగా వుంటే పట్ట ణంలో పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి నీటి వృధాను అరి కట్టాల్సి వుంది.

## దివ్యాంగుల 'భవిత'కు ప్రభుత్వం చేయూత : కేశవరెడ్డి

**చౌడేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేయూత నిస్తోందని ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మలన్నారు. దివ్యాంగుల అంతర్జాతీయ దినోత్స వాన్ని పురష్కరించుకొని స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు గౌతమ్, భవిత సిబ్బంది రామ్మోహన్, నరేష్, ఎమ్మార్సీలు రంజిత్‌కుమార్, రఘునాథ, వసంత, సుబ్రమణ్యం, ఐఇడిఎస్ఎస్ ఉపాధ్యాయుడు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## అరగొండలో ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



**తవణంపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండలో బుధ, గురువారాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను ముమ్మరంగా నిర్వహించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మండల టీడీపీ నాయకులు ఎ.రఘుపతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పరిధిలోని పైమాఘం-1, పైమాఘం-2 గ్రామాలలో బుధ, గురువారాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈగ్రామాలలో తన సొంత నిధులతో సుమారు 300 సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈకార్యక్రమంలో ఎ.రఘుపతి, నిషాంత్, ఎ.రంజిత్, కిరణ్ చౌదరి, చాన్‌భాసా, మహేష్, వంశీ, ప్రకాష్, తులసి, పైమాఘం-2 కు చెందిన గాంధీ, వినాయక తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రూట్ కవర్లు కావలసిన రైతులు నమోదు చేసుకోండి

**తవణంపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** రానున్న మామిడి సీజన్‌లో టేబుల్ రకాల మామిడికాయలకు కట్టడానికి ఫ్రూట్ కవర్లు కావలసిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని బంగారుపాళ్యం ఉద్యాన అధికారి సాగరిక తెలిపారు. ఫ్రూట్ కవర్లు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఆథార్‌కార్డు. బ్యాంకు పాస్‌బుక్ నకలును ఇచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు.



## తవణంపల్లెలో జడ్పీ సీఈఓ తనిఖీ

**తవణంపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ సీఈఓ వి.రవికుమార్ నాయుడు గురువారం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు మండలంలోని దిగువమాఘం గ్రామ సచివాల యంను, ఎంపీడీఓ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కార్యాలయాల్లోని సిబ్బంది హాజరుపట్టితో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమం లో డీఎల్‌డీఓ రవికుమార్, ఎంపీడీఓ రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**ఐరాల, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మండల కేంద్రం ఐరాలలోని భవిత కేంద్రంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ జి.ధనలక్ష్మి మాట్లాడుతూ మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు(దివ్యాంగులు) ఐరాలలోని భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంచాముండేశ్వరి,సహితవిద్యఉపాధ్యాయులుసి.సురేష్,టి.కవిత,పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వరసిద్దుని దర్శించుకున్న నరసన్నపేట ఎమ్మెల్యే



**కాణిపాకం, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ఎమ్మెల్యే బి.రమణమూర్తి గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి!

**ఐరాల, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** ముందు వెళుతున్న మోటారు సైకిల్‌ను వెనుకవైపు నుండి లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామ పంచాయతీ అక్కంచెరువుపల్లె వద్ద గురువారం సాయంత్రం జరిగింది. తెల్లగుండ్లపల్లె ఎస్సీ వాడకు చెందిన ఆత్మయ్య(43) అదే గ్రామానికి చెందిన సురేష్ వ్యక్తిగత పనుల నిమిత్తం పాకాల వెళ్ళి మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా అక్కంచెరువులపల్లె వద్ద వెనుక వైపు నుండి గుర్తు తెలియని లారీ వేగంగా వెళ్ళి ఢీ కొంది. ఇతని తలపై లారీ చక్రాలు వెళ్ళడంతో తల నుజ్జునుజ్జు అయిఅక్కడిక్కడేమృతిచెందాడు. ఈమేరకుకేసునమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా

– జిల్లా బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు జ్ఞానజగదీష్

**చిత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద గురువారం మహాధర్నా నిర్వహించినట్లు చిత్తూరు జిల్లా బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు జ్ఞానజగదీష్ తెలిపారు. బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు కేశనశంకరరావు, తెలంగాణ మాజీ మంత్రి వి.హనుమంతరావు, ఇతర బిసి సంఘాల నాయకులు, అఖిల పక్ష పార్టీ నాయకులు, మేధావులు మహాధర్నాలో పాల్గొనడం జరిగిందన్నారు. చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలనీ, 2025లో జరిగే జాతీయ జనగణచేయాలని, జనాభా దామాషా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని, మహిళా రిజర్వేషన్లు, బిసి మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలని డిమాండ్ చేసారు.

# తిరుపతి డివిజన్

## రెవెన్యూ సదస్సుపై అవగాహన సదస్సు



**సత్యవేడు, డిసెంబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడు తున్న రెవెన్యూ సదస్సులల్లో అన్ని సమస్యలను పరిష్కరించడానికి సిబ్బంది ప్రతి ఒక్కరు సహకరించాలని సత్యవేడు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం కోరారు. నేడు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌వోలు, పంచాయతీ సెక్రటరీలు, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రధానంగా భూ వివాదాల పరిష్కారానికి 22ఏ ఫ్రీహోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరిస్తామన్నారు. పైగా ప్రజల నుంచి వచ్చే వినతులే కాకుండా ఆర్‌టీజీఎస్ వెబ్ పోర్టల్ ద్వారాను దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. దీంతో పాటు రెవెన్యూ సదస్సులపై సంబంధిత ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు తప్పని సరిగా సమాచారం ఇచ్చే బాధ్యత వీఆర్‌వోపై ఉన్నట్టు గుర్తు చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందుతున్న వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను ఆయా డిపార్ట్‌మెంట్ వారిగా వేరు చేసి పంపాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందేనన్నారు. సమావేశంలో మండలపరిషత్ ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సురేష్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, సత్యవేడు పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్, పలువురు వీఆర్‌వోలు, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

**శాంతిపురం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : శాంతిపురం మండలంలో ఈనెల 6వతేది నుంచి జనవరి 8వతేది వరకు రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శివయ్య తెలిపారు. రెవెన్యూ సమస్యలు గల ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలిరోజు శెట్టిబల్లలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నేటినుంచి రెవెన్యూ గ్రామసభలు

**రామకుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** :

మండలంలోని 23 పంచాయతీల్లో నేటినుంచి జనవరి 4వతేది వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బాబు తెలిపారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఐపిఎస్ అధికారి సంజయ్ అవినీతికి మార్గదర్శి



**శాంతిపురం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : ఐపిఎస్ అధికారి సంజయ్‌కుమార్ అవినీతి, అక్రమాలకు మార్గదర్శిగా నిలిచారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం ఆశ్చర్యపరుస్తోందన్నారు. సిఐడి చీఫ్‌గా పనిచేసిన సంజయ్ ప్రజాధనాన్ని అక్రమంగా దోచుకున్నారన్నారు. అగ్నిమాపక శాఖలో ప్రాజెక్టుల నిమిత్తం టెండర్ల ప్రక్రియలో అవకవతకలు చేసి కోటిన్నర రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేశారన్నారు. 1.16కోట్లు ఈ వ్యవహారంలో నొక్కేశారన్నారు. సిఎం చంద్రబాబునాయుడును తప్పుడు సాక్ష్యాలతో అక్రమంగా అరెస్ట్ చేయడం, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ప్రెస్‌మీట్లు పెట్టడం ఆయన వ్యవహారశైలికి నిదర్శనమన్నారు.

## సచివాలయంలో జడ్పీచైర్మన్ తనిఖీలు

**శాంతిపురం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : మండల ం లోని ఎంకెపురం గ్రామ సచివాలయంలో జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులు పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, వ్యవసాయం, ఆరోగ్యంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, సర్పంచ్ మోహన్, లోకనాథరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



## కుప్పంలో అభివృద్ధి పరుగులు : శ్రీకాంత్



**రామకుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** : సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం నీటి ట్యాంకుల మరమ్మత్తుల పనులను పూజ చేసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కుప్పానికి సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతో నిధులు కేటాయిస్తున్నారన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, పత్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, సీతాపతి, చిన్నికృష్ణ, చలపతి, రఫీ, మనోహర్, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి మృతికి కారణమైన వారిపై చర్యలుతీసుకోవాలి

– జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో నిరసన

చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లా రాయచోటిలో గురువారం జరిగిన ఘటనలో మృతి చెందిన ఉపాధ్యాయుడి మృతికి కారణమైన వారిని సత్వరం అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంను ఉద్దేశించి ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ రాయచోటిలో బుధవారం జరిగిన దురదృష్ట ఘటనలో ఉపాధ్యాయుడు మృతి చెందడంను నిరసిస్తూ బుధవారం డిఇఒ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మృతి చెందిన ఉపాధ్యాయుడి ఆత్మ శాంతించాలని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీని ఫ్యాప్టో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గంటామోహన్, చెంగ్రాలాయమండడి, మదన్‌మోహన్‌రెడ్డి, మునీర్ అహ్మద్, ముక్తార్ అహ్మద్, చంద్రన్, మధుబాబు, జగదీష్, పార్థసారధి, సుల్తాన్, దేవేంద్ర పాల్గొన్నారు.

## పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు

**పాలసముద్రం, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో భూసమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 10వ తేదీ నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తు న్నట్లు ప్రజలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని తహసిల్దారు అరుణకుమారి కోరారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం తహసిల్దారు అరుణకుమారి విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో డిసెంబర్ 10వ తేదీ నుండి రెవెన్యూ సదస్సులు ప్రారంభం అవుతున్నా యన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

## ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలి

ఏపి సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి స్వామి

**తిరుపతి హెల్త్, డిసెంబర్ 5, ప్రభాతవార్త** ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని ఏపి సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మాట్లాడుతూ టిటిడి, తుడా, పంచాయితీ ఆదేశాలను కూడా లెక్క చేయని ముంతాజ్ హోటల్ యాజమాన్యం రాత్రి, పగలు తేడా లేకుండా నిర్మాణాలను కొనసాగిస్తున్న ముంతాజ్ హోటల్ కొనసాగిస్తున్నారన్నారు. అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న విషయాన్ని నిగ్గుతేల్చిన తుడా అధికారులు, తదుపరి చర్యలు కోసం పేరూరు పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. ముంతాజ్ హోటల్ వారు రాత్రి 11 గంటల వరకు అక్రమ నిర్మాణాల చేస్తూనే ఉన్నారు. టిటిడి వారు పాలక మండలి సమావేశంలో తీర్మాణం చేసినా కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణం. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పవిత్రమైన తిరుమల ఏడుకొండలను అపవిత్రం చేస్తున్న ముంతాజ్ హోటల్‌కి ఇచ్చిన 20 ఎకరాల ప్రభుత్వ భూమిని తక్షణమే కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగించాలని లేని పక్షంలో స్వామిజీలతో, హింధూ సంఘాలతో కలిసి అమరణ నిరాహార దీక్ష చేస్తామని ఈ కూటమి ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణ రావు, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మా ఓంకార్, అభయహస్త గోవిందసేవా అధ్యక్షులు చంద్రమౌళి, పేరూరు బాలకృష్ణ, మధు, నీలకంత, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పరిసరాల్లో ఫ్లెక్సీలపై దృష్టి సారించండి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయం పరిసరాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలపై దృష్టి సారించాలని తెలుగుయువత నాయకుడు డాక్టర్ ఉమేష్‌రావు కోరారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో శ్రీకాళహస్తీశ్వరాలయం ఎంతో పవిత్రమైనదని ఇక్కడకు దూర ప్రాంతాల నుంచి భక్తులు అతిథులు వస్తున్నారని అయితే ఇక్కడకు భక్తి భావంతో వచ్చే భక్తులకు మరణ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయని ఇది భక్తుల మనో భావాలను దెబ్బతిసేవిధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆలయానికినాలుగు ప్రవేశ ద్వారాల ముందు ఇలాంటి ఫ్లెక్సీలను నిషేధించేలా చూడాలని కోరారు.

## ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 6 ప్రభాతవార్త :**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన పోటులో విక్రయశాలకు సరఫరా చేస్తున్న ప్రసాదాల లెక్కల్లో తేడా రావటంతో అక్కడ పని చేస్తున్న ఉద్యోగిని సస్పెన్షన్ చేసినట్లు ఇఒ డి.బాపిరాజు తెలిపారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలో జవాబుదారి తనంతో పని చేసే సురేష్‌రెడ్డి విక్రయ కౌంటర్‌కు సరఫరా చేసిన పులిహోర ప్రసాదానికి స్టాక్ రిజిస్టర్‌కు పొంతన లేనట్లు గుర్తించారు. అయితే లెక్కల్లో తేడా ఉండటంతో విచారణ నిమిత్తం ఆయన్ను విధుల నుంచి నిలుపుదల చేసినట్లు ప్రకటించారు.

## పంచాయతీ కార్యదర్శుల సంఘం

**శ్రీకాళహస్తి రూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :**



ఏర్పేడు మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శులు ఎ దుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా మండల కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.షఫీవుల్లా, ఉపాధ్యాక్షులుగా పివీ.లీలా కుమారి, కోశాధికారిగా పి.లోకమునిలను ఎన్నుకున్నట్లు అధ్యక్షులు షఫీవుల్లా గురువారం తెలిపారు.

## శివయ్య సేవలో టిటిడి బోర్డు సభ్యుడు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త :**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో గురువారం టిటిడిబోర్డు సభ్యులు బుగనూరు మహీధర్‌రెడ్డి విచ్చేసారు.వారికి జనసేన పార్టీకి చెందిన నియోజకవర్గ నాయకులు స్వాగతం పలికారు. స్వామిఅ మ్మవార్లను దర్శించుకున్న మహీధర్‌రెడ్డికి వేదపండితులు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన ఐటీ కోఆర్డినేటర్ కావలి శివకుమార్ పట్టణ అధ్యక్షులు తోట గణేష్, ఉపాధ్యక్షులు జ్యోతిరామ్, నాయకులు గరిక సురేష్, దుమ్మురాయల్ స్వాగతం పలికారు.

## ఉపాధికూలీలకు పనిరోజులు కల్పించండి..డ్వామా పిడి



**తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభావార్త :** ఉపాధి కూలీలకు పనిరోజులు కల్పించాలని డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్ అన్నారు. గురువారం క్లస్టర్ పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కెవిబిపురం, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యాపాళెం, సత్యవేడు, వెంకటగిరి మండలాల ఎపిఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి అధికారులు, ఇసిలుతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ఈనెలలో పనిరోజులు తగ్గాయని వాటిని పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీలో నిర్మించనున్న పశువుల శాలలు ఈనెల 15లోపు పూర్తిచేయాలన్నారు. పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపిడి ప్రేమ్‌కుమార్, ఏడు మండలాలకు చెందిన ఎపిఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సదస్సులను సద్వినియోగం చేసుకోండి : తహశీల్దార్



**శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి తహశీల్దార్ లక్ష్మి నారాయణ కోరారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహశీల్దార్ లక్ష్మినారాయణ తెలిపారు. భూ సమస్యలు ఉన్న వారు ఈసదస్సులో వినతిపత్రాలు ఇచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడుకి తెదేపా నాయకులు సత్కారం

**తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త :**



జిల్లా కలెక్టర్‌చే ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రశంసలు అందుకున్న దిగువసాంబయ్యాపాళెం ప్రాథమిక పాఠశాల సెంకడరీ గ్రేడ్ టీచర్ కయ్యూరు బాలసుబ్రమణ్యంను గ్రామస్తులు మరియు వారి ఆహ్వానం మేరకు మండల టిడిపి అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, విశ్రాంత ఎంపిడిఓ మోహన్‌రావు, మునిచంద్రారెడ్డి, కస్తూరయ్య, శంకర్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త మోహనరాణి, ఆదిలక్ష్మి, పద్మప్రియ, జయరత్న తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునిపై దాడి శోచనీయం

**తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త :**



రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయునిపై విద్యార్థులు దాడిచేసిన సంఘటనను తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండి స్తోంది. సంస్కృతిని గాడిలో పెట్టాలని ప్రభుత్వం తక్షణమే స్పందించి దోషులను శిక్షించాలని సదరు ఉపా ధ్యాయ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఏపిటిఎఫ్ తిరుపతి జిల్లా శాఖ అధ్యక్షులు బి. మురళీకృష్ణకోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కె.వెంకటా ద్రి, సబ్ కమిటీ సభ్యులు ఆర్.గోపాల్‌యాదవ్, సురేష్‌బాబు, బి.హేమకుమార్, పట్టణశాఖ అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శి పిడి.చంద్రశేఖర్, సబ్ కమిటీ సభ్యులు టి.ప్రసాద్‌బాబు, సి.దిలీప్ హెచ్ఎం బృందాదేవి మరియు పాఠశా లఉపాధ్యాయులుపాల్గొన్నారు.మరణించినఉపాధ్యాయునిఆత్మకుశాంతి చేకూర్చాలని మౌనం వహించారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



**తొట్టంబేడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** మండలంలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ యు.మధుసూధనరావు తెలిపారు. గ్రామల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు సిసిఎల్ఏ ఆదేశాల మేరకు ప్రతి మండలంలోని ప్రతి గ్రాఆమంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించాల్సిందిగా ఆదేశించి ఉన్నారు. సదస్సుల్లో తహశీల్దార్‌తో పాటు మండల సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సంబందిత గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ హజరై సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రతి రైతు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్క అధికారి హాజరు కావాలని తహశీల్దార్ కోరారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



తిరుపతిరూరల్,డిసెంబర్5 ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా రెవెన్యూలో నెలకున్న సమస్యలను పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తు ఎదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతిరూరల్ తహశీల్దార్ రామాంజులనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిరూరల్ మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహిస్తున్నట్లు తిరుపతిరూరల్ తహశీల్దార్ తెలిపారు.

## రైతులు భూసార పరీక్షలు తప్పక నిర్వహించాలి

– జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



**కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పక నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. గురువారం బంగానత్తం రైతు సేవా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ అమృతవల్లి మాట్లాడుతూ నేల సంరక్షణ, పంటలసాగు, నవధాన్యాల సాగు, జీవామృతం తయారీపై వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ ఔరంగ్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

## నెట్ సెంటర్లను సీజ్ చేసిన అధికారులు

**రామకుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నెట్ సెంటర్లలో నకిలీ జనన ధృవీకరణపత్రాలు ఇస్తున్న రెండు సెంటర్లను గురువారం రాత్రి కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు నేతృత్వంలో తహశీల్దార్ బాబు, సిఐ మల్లేష్ యాదవ్‌లు సీజ్ చేశారు. గురువారం పలు నెట్ సెంటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. రామకుప్పంలో నవీన్ అనేయువకుడు, వీర్నమలలో బాలాజీ నాయక్ అనే యువకుడు నెట్ సెంటర్లను నిర్వహిస్తూ ఇటీవల నకిలీ జనన ధృవీకరణ పత్రాలు అందించారని గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ అంశంగా పూర్తిస్థాయి విచారణకు ఆర్డీఒ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీకాంత్, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**కేవీబిపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

నేటి నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కేవీబీపురం మండల తహసీల్దార్ మునిరత్నం ఒకప్రకటనలో తెలిపారు. కేవీబీపురం మండలంలో 39 గ్రామ పంచాయతీలకు సంబంధించి అన్ని హేబిటేషన్‌లో కలిపి ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని వారి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. రైతులు, ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నీటి సంఘాల ఎన్నికలు

**కేవీబీ పురం, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

రాష్ట్ర ఉమ్మడి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి(ఆయ కట్టు ఎన్నికలు) ఇప్పుడు జీవో వదిలినా ప్రశాంత వాతావరణంలో నీటిసంఘ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇచ్చిన ప్రొఫైల్‌ను సక్రమంగా ఫిల్ చేయాలని ఇరిగేషన్ శాఖ డీఈ రత్నారెడ్డి తెలిపారు. ఎంపీడీవో రాధారాణి అధ్యక్షతన కేవీబీపురం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ మునిరత్నం, ఏవో మురళీకృష్ణ, వెటర్నరీ గుణశేఖర్, ఇరిగేషన్ ఏఈ సురేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, మహిళా పోలీసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ప్రొసీడింగ్ అధికారులు పాల్గొన్నారు.

## శ్వాసనీయత పెంచుతున్న టాటా మోటార్స్

**తిరుపతి విద్య, డిసెంబర్ 5 ప్రభాతవార్త:**

వినియోగదారుల విశ్వాసనీయతను టాటా మోటార్స్ ట్రక్కులు మరింత పెంచుతున్నాయని టాటా మోటర్స్ ట్రక్స్ వైస్ ప్రెసిడెంట్,బిజినెస్ హెడ్ రాజేష్ కౌల్ తెలిపారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్ద ఎత్తున పెట్టుబడులు,ప్రాజెక్టులు కీలక పరిశ్రమ లకు ఉత్పాధక శక్తి కేంద్రంగా మారడంతో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన మౌలిక సదుపాయాల వృద్ధిని సాధిస్తోందన్నారు.

## రేణిగుంట నుంచి సింగపూర్‌కు తొలి విమానం

**రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

రేణిగుంట(తిరుపతి) అంతర్జాతీయ విమా నాశ్రయం నుంచి డిసెంబరు 6తేదీ ఓ ప్రైవేటు విమానం సింగపూర్‌కి బయలుదేరుతుందని విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నె తెలియజేశారు. విమానం సురక్షితంగా బయలుదేరడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశాల మేరకు మొదటి అంతర్జాతీయ విమానం బయలుదేరడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఈ విమానం బయలుదేరడం భవిష్యత్‌లో అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి దోహదం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

## ఆషా రాజుకు మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు

**రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త:**




ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవ స్థాపకుడు, ప్రస్తుత అధ్యక్షుడు జూలియన్‌రాజుకు మదర్‌థెరిస్సా సేవా రత్న అవార్డు లభించింది. ఈ అవార్డు ఆయనకు దక్కింది. కడప జిల్లా పోరు మామిళ్ళలో అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ చిత్త రవి ప్రకాష్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చిత్త విజయ ప్రతాప్‌రెడ్డి, చిత్త గిరి ప్రణీత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు వర్గాలకు నిర్విరామంగా తమ సంస్థసేవలు చేస్తున్నదన్నారు.

## సమస్యల సుడిలో... ఏకలవ్య గురుకుల పాఠశాల

**బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 5 ప్రభాతవార్త:**



మండలంలోని కనమనం బేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో కొన్ని నెలలుగా నీటి సమస్య, ఉపాధ్యాయుల మధ్య ఘర్షణతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ విషయం ఏఐఎస్ఎఫ్ దృష్టికి రావడంతో అక్కడ పాఠశాలను సందర్శించి ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని, వాటినిఇ వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఉపాధ్యాయుల మధ్య ఘర్షణతో విద్యాబోధనలో విద్యార్థులకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ నాయకులు షారుక్, సన్నీ, శశి, శ్యామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

**బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు నేటి నుంచి జనవరి 2వ తేదీ వరకు మండలంలోని పంచాయతీల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి భారతి తెలిపారు. రెవెన్యూ సదస్సులకు ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన తేదీలు ప్రకారం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో వినతిపత్రాలు అందజేసి సమస్యను పరిష్కరించు కోవాలన్నారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

**విజయపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి నేడు శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సభలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేటి నుంచి పల్లెబాట పట్టనున్న రెవెన్యూశాఖ

**సత్యవేడు, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

సుమారు ఏడేళ్ళ అనంతరం రెవెన్యూశాఖ పల్లెబాట పట్టనుంది. ప్రధానంగా రెవెన్యూ సమస్యలు పేదలను వేధిస్తుండడంతో ప్రభుత్వం ముందుకు వచ్చింది. భూ కబ్జాలకు ఎక్కడ అవకాశం లేకుండా పేదలకు న్యాయం చేయాలని, ఆమెకు రెవెన్యూ సిబ్బంది కచ్చితంగా పని చేయాలని కూడా ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం. సత్యవేడు మండలంలోని చెరివి రెవెన్యూ విలేజీ నుంచి రెవెన్యూ సదస్సులకు శుక్రవారం నుంచి శ్రీకారం చుడుతున్నట్లు తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం మీడియాకు తెలిపారు. రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని, అన్ని రకాల సమస్యలకు పరిష్కారం ఇక్కడే దొరుకుతుందని తహసీల్దార్ వెల్లడించారు.

## సత్యవేడులో పోలీసులు తనిఖీలు

**సత్యవేడు, డిసెంబరు 5 ప్రభాతవార్త:**



సత్యవేడు పట్టణంలో వాహనాల తనిఖీలను ముమ్మరంగా పోలీసులు చేపట్టా రు. ఇందులో భాగంగా గురువారం ఎస్ఐ రామ స్వామి ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్ హరి, విజయశేఖర్, కుప్పారావు, హోం గార్డు గురవయ్య తదితరులు బృందం పట్ట ణంలోని గాంధీ విగ్రహం వద్ద పలు వాహ నాలను తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో రికార్డులు సక్రమంగా లేని పలు వాహన దారులకు జరిమానా విధించారు. అలాగే వయసు 18 లోపు మైనర్ పిల్లలు వాహనాలు నడపరా దన్నారు.వాహనాలను రోడ్డుపై ఎక్కడబడితే అక్కడ పార్కు చేసి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటుందన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి రూ.5లక్షలు విరాళం

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం బెంగుళూరుకు చెందిన భక్తులు రూ.5లక్షల విరాళాన్ని నిత్యాన్న ప్రసాదానికి విరాళం అందించారు. నిత్యభక్తులైన బెంగుళూరుకు చెందిన కె.సంతోష్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి రూ.5లక్షల చెక్కును కృష్ణారెడ్డికి అందించారు. వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.



## మేధా దక్షిణామూర్తికి ప్రత్యేకాలంకారం

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త :**

మేధా గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారథ్యంలో అలంకారాలు నిర్వహించారు. ఈ పూజల్లో పట్టణానికి చెందిన వందలాది మంది పాల్గొన్నారు.ఈ పూజల్లో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేటి నుంచి పుత్తూరులో రెవెన్యూ సదస్సులు

**పుత్తూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త :** మండలంలో అన్ని పంచాయతీల్లో ఈ నెల 6వ తేదీ నుంచి డిసెంబరు 23వ తేదీ వరకూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహశీల్దారు డి.సి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను ఆ సదస్సుల్లోనే పరిష్కరిస్తామన్నారు. రికార్డుల్లో మార్పు తదితర అంశాలకు సంబంధించి నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 6వ తేదీన తడుకు రెవెన్యూ గ్రామానికి సంబంధించి తడుకు పంచాయతీ ఆఫీసు పక్కనే వున్న ఎంపిపిఎస్ స్కూల్లో సదస్సు నిర్వహిస్తామన్నారు. అలాగే 7వ తేదీన ఉదయం రామకృష్ణాపురం, మధ్యాహ్నం శిరుగురాజుపాలెంలో, 9వ తేదీన తొరూరు, 10వ తేదీన నేసనూరు, 11వ తేదీన ఉదయం గోవిందపాలెం, మధ్యాహ్నం వీరప్పరెడ్డిపాలెం, 12న నందిమంగళం, 13న ఉదయం వేపగుంట, మధ్యాహ్నం ఉత్తరపుకండ్రిగ, 16వ తేదీన పరమేశ్వరమంగళం, 17న తిరుమలకుప్పం, 18న కెబిఆర్ పురం, 19న పుత్తూరు, 20న చెర్లోపల్లి, 21న ఈశ్వరాపురం, 23న ఉదయం కె.ఎం.అగ్రహారం, మధ్యాహ్నం గొల్లపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని వివరించారు.

## మహాసభ విజయవంతం : సీపీఎం

**సత్యవేడు, డిసెంబరు 5 ప్రభాతవార్త:**



సత్యవేడు పట్టణంలో నిర్వహించిన సీపీఎం పార్టీ 14వ జిల్లా మహాసభలు విజయవంతానికి సహకరించిన పట్టణ ప్రజానీకానికి నియోజకవర్గంలోని రాజకీయ, వ్యాపార, ఉద్యోగ, ప్రముఖులకు సీపీఎం పార్టీ తరపున ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి మెలుగు రమేష్, నాయకులు నాగరాజులు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ ప్రజలు చూపిన ఆదరాభిమానాలతో రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని ప్రజా సమస్యలే తమ అజెండాగా పని చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. మహాసభలో ఇచ్చిన ఉత్సాహంతో నియోజకవర్గంలోనే కార్మికులు, రైతులు విద్యార్థులు, దళితులు, గిరిజనులు వెనుకబడిన తరగతుల ప్రజాప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వారు తెలియజేశారు.

## భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



**వడమాలపేట, డిసెంబరు 5 ప్రభాతవార్త:** భూసారపరీక్షలు చేసుకోవడం వల్ల సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చునని తిరుపతి భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అప్పలాయగుంటలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూమిలో ఏప పోషకాలు లోపించాయో ఆ ఎరువులను వాడుకుంటే సరిపోతుందని దాని వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. తిరుపతి, వ్యవసాయ పరిశోధన స్థానం ఆవరణలో పరీక్షలు రైతులకు ఉచితంగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం, జిల్లా ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ భాస్కరయ్య మాట్లాడుతూ నేల ఆరోగ్యంతోనే రైతు సౌభాగ్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, భూసార పరీక్ష కేంద్రం ఏవో రామాంజ నేయరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జాహ్నవి, గ్రామ సర్పంచ్ శేషాద్రి రెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

**వడమాలపేట, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

వడమాలపేట మండలంలోని 22 రెవెన్యూ గ్రామాల పరిధిలో నేడు శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జరీనా తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సదస్సులో అధికారులు అందుబాటులో ఉంటారని రైతులు తమ సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవచ్చునని జరీనా తెలిపారు.

## పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్ : కమిషనర్

**నగరి, డిసెంబరు 5 ప్రభాతవార్త:**



పేరుకుపోయిన పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌ని మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. మున్సి పాలటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు మున్సి పాలిటీని పట్టుకున్న మున్సిపల్‌పన్ను వసూలు సమస్యను పరిష్కరించేందుకు నడుం బిగించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సిబ్బందితోపాటు వెళ్లి పన్ను బకాయిలు చెల్లించాల్సిన వారి ఇళ్ళ వద్దకే వెళ్లి నివాసితులకు అవగాహన ఏర్పరచి పన్ను వసూలు చేసే ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభిచంఆరు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

నగరి, డిసెంబరు 5 ప్రభాతవార్త: నగరి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో శుక్రవారం నుంచి రోజువారిగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని జనవరి 8వ తేదీ వరకు కొనసాగుతుందని ఆర్డీవో భవానీశంకరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు అందరూ ఈ సదస్సులకు పాల్గొనాలన్నారు. రెవెన్యూ, రీ సర్వేకు సంబంధించిన సమస్యలన్నీ షెడ్యూలు ప్రకారం ఆయా గ్రామాలకు చెందిన వారు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇవ్వవచ్చున్నారు. తహసీల్దార్‌లు, సర్వేయర్లు, గ్రామ అధికారులు వచ్చి హాజరై ప్రజల సమస్యలను పరిశీలిస్తారన్నారు. శుక్రవారం మండలంలోని మాంగాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తొలి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

## వైకల్యం శరీరానికి మనసుకు కాదు : ఎంఈవో

**నగరి, డిసెంబరు 5 ప్రభాతవార్త:**



వైకల్యం శరీరానికి ఉంటుంది కాని మనసుకు ఉండదని ఎంఈవో శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నగరి మండలం భవిత కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు డ్రాయింగ్, ఆర్ట్ మొదలగు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ వైకల్యం శరీరానికి కాని మనసుకు ఉండదన్నారు. మండల విద్యాశాఖ అధికారి–2 నమఃశివాయం మాట్లాడుతూ భవిత కేంద్రంలో ఇస్తున్న 11 రకాల సేవలను వాటిని వివరించి తల్లిదండ్రులు ఈ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం దాతలు కృష్ణారామాపురంకు చెందిన ఆక్సిజన్ కోసం ట్రంప్ పోలింగ్ కొనుగోలుకు రూ.12 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు పార్వతి, భవితకేంద్ర ఉపాధ్యాయులుభవాని,సంతోష్ నాయక్, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరులో రైల్వే కార్మికుల ఎన్నికలు ప్రశాంతం

**పుత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:**

దేశవ్యాప్తంగా జరుగుతున్న రైల్వే ఎన్నికల్లో భాగంగా చెన్నై డివిజన్‌లోని పుత్తూరు బ్రాంచిలో ప్రశాంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో దక్షిణ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంస్థ పోటీలో ఉంది. ఈ సంఘానికి మద్దతుగా తిరుపతి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.మునిరాజా, స్థానిక సీఐటీయూ నాయకులు వెంకటేష్ మద్దతుగా పాల్గొన్నారు. చెన్నై డివిజన్ దక్షిణ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుకుమారన్ సందర్శించారు. పుత్తూరు సీఐటీయూ నాయకులు ఏ.విజయ్, యాసిన్ బాషా, శివ, పురుషోత్తం, కృష్ణమూర్తి, బాబ్జి, ప్రశాంత్, కృష్ణయ్య, శివశంకర్‌రావు, ప్రవీణ్, డీఆర్‌యూ నాయకులు యువరాజు, సురేష్, విజయభాస్కర్, నాగరాజు, స్టాలిన్ పాల్గొన్నారు.

## దివ్యంగుల్లో ఉత్తేజాన్నినింపాలి : యంపిపి

**నింద్ర,డిసెంబరు 5 ప్రభాతవార్త :**



దివ్యంగుల పిల్లలలో ఉత్తేజాని తెచ్చి వెలుగు నింపాలని నింద్ర యంపిపి దీపాజలంధర్‌రాజు తెలిపారు. గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరిగింది.ఈసందర్భంగా మండలంలోని వివిధ రకాల దివ్యాంగుల పిల్లలు,వారి తల్లిదండ్రులు హాజరైనారు. మండల అభివృద్ధి అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ అన్ని రకాల సేవలు అందుబాటులో వున్నాయని వారి నైపుణ్యం గ్రహించి వారికి సరైన శిక్షణ ఇచ్చినట్లుయితే ప్రయోజకులు అవుతారని అన్నారు.మండల విద్యా శాఖాధికారులు వసుమతిదేవి,శ్రీధర్‌రాజు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల మానసిక సైర్యాన్ని సైతం నింపవచ్చునని చెప్పారు.దివ్యాంగుల పిల్లలకు ప్రభు త్వం అన్ని రకాలైన సహాయ సహకారాలు అందుస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, రాజేష్, సిఆర్‌పిలు కేర్‌గివర్‌గీత,సహిత ఉపాధ్యాయులు వాసు,వెంకటేశులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే పేదలకు న్యాయం

**-గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**



కోట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల కోసం గూడూరు నియోజకవర్గంలో అధికారులు నిజాయితీగా వ్యవహరిస్తే పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గురువారం కోటలోని షాదీ మంజి ల్‌లో యువజన సంఘం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పేద ప్రజలు సాగు చేస్తున్న భూములను భూస్వాములు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని చెప్పారు. వారి చెర నుంచి బయట పడాలంటే ప్రస్తుతం రెవెన్యూ సదస్సులను చక్కగా ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కేశవరం పంచాయతీలో ఈ భూ ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. చిల్లకూరు మండలంలో పేదల భూములను సిలికా వ్యాపారులు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారని చెప్పారు. తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించింది పేద ప్రజలే అని స్పష్టం చేశారు. కోట రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎన్విరాన్‌మెంట్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, జలీల్ అహ్మద్, మధుయాదవ్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలించిన డిప్యూటీ సిఇఓ



కోట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : కోటలోని జిల్లా పరిషత్ ఆస్తి అయిన గ్రంథాలయ భవనం సమీపంలో భూములు లీజుకు ఇవ్వడంతో ఆ భూమిని గురువారం ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఓ మోహన్‌రావు పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వాకాడు మండలం నుంచి సిపిడబ్ల్యు స్కీమ్ నుంచి కోట మండలంలోని ఏడు పంచాయతీలకు మంచినీటి సరఫరా జరుగుతుంది. ఏఇఆర్‌డబ్ల్యుఎస్ అరవింద్ ను అడిగి మంచినీటి సరఫరా గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపిడిఓ వేణు, ఇఓపిఆర్‌డి కిరణ్‌కుమార్ ఉన్నారు.

## కోట మండల రెవెన్యూ సదస్సుల షెడ్యూలు విడుదల

కోట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నేటి నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించిన షెడ్యూల్‌ను గురువారం కోట మండల తహశీల్దార్ కె.జయజయ రావు విడుదల చేశారు. ప్రజలకు సంబంధించిన భూముల్లో ఎవరికైనా అన్యాయం జరిగిఉంటే వారు ఈ సదస్సులలో అర్జీలు ఇచ్చుకోవచ్చని తెలిపారు.

## చిరస్మరణీయుడు వేనాటి మునిరెడ్డి



సూళ్లూరుపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : సూళ్లూరుపేట రాజకీయాల్లో పెద్ద దిక్కుగా ఉంటూ తెలుగుదేశం పార్టీకి కొండంత అండగా పనిచేసి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా వేనాటి మునిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీ యమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో దివంగత నేత వేనాటి మునిరెడ్డి 24వవర్ధంతి సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. సూళ్లూరుపేట ప్రాంతంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడంలోను, పార్టీ కార్యకర్తలకు అండదండగా ఉండటంలో మునిరెడ్డి ముందంజలో ఉండేవారని తెలిపారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 24వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్ క్రాస్ సొసైటీ వారిచే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో రక్తదాతలు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వట్రపాలెంలో బిసి నాయకులు చిట్టేటి పెరుమాళ్ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్ఎన్ మునిరాజా, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, అలవల శ్రీనివాసరావు, నూలేటి విజయలక్ష్మి, మెస్ రమణయ్య, పిట్ల సుబ్రహ్మణ్యం, పి.సుబ్బయ్య, పాకం వెంకటసుబ్బయ్య, బండారు ఆంజనేయులు, బుద్ధి విజయలక్ష్మి, మంజుల, శారద, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

సూళ్లూరుపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహశీల్దార్ ఎస్వి నరసింహారావు గురువారం తెలిపారు. గ్రామాల వారీగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇతర రెవెన్యూ సమస్యలపై కూడా ఈ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలు పరిశీలించి తగు న్యాయం జరుగుతుందన్నారు.

## అమ్మా నాన్న... రండి మా బడికి

**7 న తల్లిదండ్రులతో మెగా సమావేశాలు**

కోట,డిసెంబరు 5 ప్రభాతవార్త : పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు పాఠశాలల వైపు అడుగులు వేసేందుకు డిసెంబరు 7న మెగా తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాల్ని పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖధికారి 2 మస్తానయ్య తెలిపారు. ఆయన ప్రభాతవార్త తో మాట్లాడుతూ మండలంలో ప్రతి పాఠశాలలో సమావేశాలు నిర్వహించాలన్నారు. పిల్లలు బలాలు, బలహీనతలపై చర్చించుకునేందుకు తద్వారా విద్యార్థుల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. పిల్లలు ఇళ్ల వద్ద సెల్ ఫోన్లు,ట్యాబ్‌లు ఎక్కువా టీవీ ప్రోగ్రాంలు చూడకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పిసంచడం జరుగుతందన్నారు.

## రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించండి : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : సూళ్లూరుపేట నియోజకవర్గంలో రెవెన్యూ సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ అవగాహన సదస్సు కార్యక్రమంలో మాట్లాడారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో రెవెన్యూ శాఖలకు సంబంధించి సిబ్బంది కొరత ఉందని, భర్తీ చేయా లని ఆమె జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి స్మశాన వాటికల సమస్య ఉందని, ఒక వేళ స్మశానం ఉన్నప్పటికి రోడ్డు మార్గాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. డిసెంబర్ 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే ఈ రెవెన్యూ సదస్సులలో ప్రజల రెవెన్యూకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉపయోగించు కోవాలని ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 448వ నేత్రదానం

సూళ్లూరుపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు గురువారం 448వ నేత్రదానం అందింది. షార్ వై జంక్షన్ ప్రాంతంలో నివసిస్తున్న ఎన్.గురవయ్య మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన మృతదేహం నుంచి కార్నియాలు సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపించారు. ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## తడలో దివంగత వేనాటి మునిరెడ్డి వర్ధంతి

తడ, డిసెంబర్ 5 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ దివంగత నాయకులు, ఎన్‌డిసిసిబి ఛైర్మన్‌గా సేవలు అందించిన వేనాటి మునిరెడ్డి 24వ వర్ధంతి కార్యక్రమాన్ని తడలో గురువారం జరిపారు. మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డితో పాటు పలువురు నాయకులు మునిరెడ్డి చిత్రపటానికి పూజలు చేసి, సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వల్లాం విజయమ్మ, నీలకంఠం, శివాజీ, మనోహర్, రమేష్, ఏడుమలై తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ జీవన ఎరువులు వాడాలి

వెంకటగిరి, డిసెంబర్ 5 ప్రభాతవార్త : భూమి ఆరోగ్యంగా ఉండాలంటే రైతులు జీవన, సేంద్రియ ఎరువులు వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెరివారంలోని కృషి విజ్ఞాన కేంద్రంనందు ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించి రైతులకు భూమి ఆరోగ్యం పట్ల అవగాహన నిర్వహించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ భూమి ఆరోగ్యం కాపాడు కోవడానికి రైతులు సేంద్రియ, జీవన ఎరువులు వినియోగించుకోవాలని తెలియ చేసారు. వెంకటగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు నాగార్జున సాగర్ పచ్చిరొట్ట ఎరువులు వాడడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో రైతులకు భూసారా పరీక్ష పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుజాత, ఉద్యాన అధికారి ఆనంద్‌రెడ్డి, కె. వి. కె శాస్త్రవేత్తలు డా.ఐ.రాజీవన, డా. పి.నాగార్జునరెడ్డి, డా.తిరుపాల్, ఏపీ సీఎం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు నారాయణవనం విద్యార్థి



నారాయణవనం, డిసెంబరు 5 ప్రభాతవార్త: నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.ఎస్.నవీన్‌కుమార్ గత వారం చిత్తూరు జిల్లాలో అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మన జిల్లా జట్టు క్యాచర్‌గా మంచి ప్రతిభను కనబరచి జాతీయ స్థాయిపోటీలకు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సులోచన, వ్యాయామ ఉపాధ్యా యులు ఏ.జయప్రకాష్‌లు తెలిపారు. ఈ నెలలో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.ఎంపిక కాబడిన క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, వర్మ, కోటి, వెంకటరమణ, మునివేలు, ఓసైమల్లి అభినందించారు.

## రూ.లక్షతో తెలుగుదేశం శాశ్వత సభ్యత్వం

**- ఆర్వీటిబాబుకు దక్కిన బాబు ప్రశంస**



పుంగనూరు,డిసెంబరు 5 ప్రభాతవార్త : అక్షరాలా లక్ష రూపాయలు చెల్లించి, తనకు పార్టీపై ఉన్న మమకారం చాటి తెలుగుదేశం శాశ్వత సభ్యత్వం తీసకున్న ఘనత పుంగనూరు ఆర్వీటిబాబుకే దక్కింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో తెలుగుదేశం పార్టీకు యువనేత ఆర్వీటి బాబు కుటుంబం అండగా ఉంది. ఈనేపథ్యంలో జిల్లాలో సభ్యత్వప్రక్రియలు అత్యంత వేగవంతంగా సాగుతుండడంతో పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో సభ్యత్వాలనమోదును ఆరీ వ్టిబాబు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. అయితే, తెలుగుదేశం పార్టీ తరఫున ఇటీవల విజయవాడ వరదసాయానికి తన వంతుగా రూ. పదిలక్షలు నేరుగా సిఎం చంద్రబాబుకు ఆర్వీటిబాబు అందచేశారు. దీంతో రాష్ట్రమంత్రి నారాలోకేష్‌బాబు ఆర్వీటిబాబును తెలుగుదేశం శాశ్వత సభ్యత్వం తీసుకోవాల్సిందిగా సూచించడంతో ఆర్వీటిబాబు నేరుగా పార్టీ కార్యాలయానికి రూ.లక్ష చెక్కు అందచేసి పార్టీ శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. ఈవిషయం తెలియడంతో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు,నారాలోకేష్‌లు ఆర్వీటికి ప్రశంసలు తెలిపారు. పుంగనూరులో పార్టీ పురోభివృద్ధికి మరింతగా ఆర్వీటిబాబు ఉపక్రమించాలని సూచించారు.జిల్లాలో తెలుగుదేశం శాశ్వత సభ్యత్వం కలిగిన నాయకుడుగా ఆర్వీటిబాబు గుర్తింపు పొందారు.

## క్రీడలతోనే శారీరక ధారుడ్యం

**- మాజీ ఎమ్మెల్యే సికె బాబు**



చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త: క్రీడలతోనే విద్యార్థినీ విద్యార్థులకు శారీరక ధారుడ్యం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకులు సికె బాబు అన్నారు. చిత్తూరు నగర పరిధిలోని ముత్తిరేవుల వద్ద క్రిక్ కార్నర్ క్రీడీ మైదానంను గురువారం మాజీ ఎమ్మెల్యే సికె బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సికె బాబు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధిస్తే శారీరకంగా ధారుడ్యంగా వుండగలుగుతా రన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. అలాంటి వారు మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో పాల్గొనాలని కోరారు.

## రాస్‌లో ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం



రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త: రేణిగుంట మండలం చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రపంచ నేలలు దినోత్సవం ఘనంగా జరిగింది. నేలను మించిన దైవం లేదని, నేలలోనే మణులు, మాణక్యాలు, బంగారం, తదితర ఖనిజాలతో పాటు జీవించడానికి కావలసిన నీరు, ఆహార పదార్థాలు లభిస్తాయని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాసులు నేలల గొప్పతనాన్ని వివరించారు. నేలలను ప్రకృతి ప్రసాదించిన వరంగా భావించి మట్టి నాణ్యతను కాపాడుకోవాలని రైతులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి ప్రసాదిత పదార్థాల ద్వారా రసాయనాలకు దూరంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఎన్నో ప్రయోగాలు చేసి ఎరువులను ఎలా రూపొందించాలో తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, శశిధర్‌రెడ్డి, రాస్ కృషి విజ్ఞాన కేంద్రంసీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు సుధాకర్, రాము కుమార్, అనూష, తిరుపతి జిల్లాలోని వివిధ మండలాల రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బర్డ్, స్విమ్స్ ఆసుపత్రులను ప్రజోపయోగంగా మార్చండి

**- టీటీడీ ఛైర్మన్‌కు సిఐటియు నేత కందారపు వినతి**



తిరుపతి హెల్త్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బర్డ్, స్విమ్స్, ఆయుర్వేద ఆసుపత్రులను ప్రజోపయోగంగా తీర్చిదిద్దాలని బర్డ్ ఆసుపత్రికి పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి టిటిడి పాలక మండలి అధ్యక్షులు బిఆర్ నాయుడుకి వినతి పత్రం సమర్పించారు. గురువారం మధ్యాహ్నం కందారపు మురళి తిరుమలలోని ఛైర్మన్ కార్యాలయంలో బిఆర్ నాయుడిని కలిసి టీటీడీ ఆసుపత్రుల తీరుతెన్నుల గురించి వివరించారు. బర్డ్ ఆసుపత్రికి పూర్తిస్థాయి డైరెక్టర్ లేకపోవడం మూలంగా పరిపాలన కుంటుపడిందని, అభివృద్ధి పనులు ఆగిపోయాయని రోగులకు అవసరమైన నిర్ణయాలు చేయడంలో తాత్సారం జరుగుతున్నదని వివరించారు. బర్డ్, స్విమ్స్ ఆసుపత్రులలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులలో కొందరిని కార్పొరేషన్ ద్వారా తీసుకున్నారని, మరికొందరు కాంట్రాక్టర్ల వద్ద బానిస బతుకులు బతుకు తున్నారని అందరినీ కార్పొరేషన్ ఉద్యోగులుగా చేర్చుకోవాల్సింది పోయి టీటీడీ యాజమాన్యం వివక్ష చూపడం అన్యాయమని ఛైర్మన్‌కు వివరించారు. శ్రీవారి మెట్టు నడక మార్గంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న పేదలు గత 110 రోజులుగా టీటీడీ పరిపాలనా భవనం వద్ద నిరసన దీక్షలు చేస్తున్నారని, వారికి న్యాయం చేయాలని కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. టిటిడి పాలక మండలి అధ్యక్షులు బి.ఆర్.నాయుడు స్పందిస్తూ స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రులనే కాదు టీటీడీలోని అన్ని రకాల ఆసుపత్రులను పరిశీలించి భక్తులకు సామాన్యులకు తోడ్పడే సాధనాలుగా మార్చడానికి కసరత్తు చేస్తున్నామని త్వరలోనే వివరాలు ప్రకటిస్తామని డైరెక్టర్ నియామకం తొందర్లో పూర్తవుతుందని వివరించారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు.

## సిఎం కోఆర్డినేటర్‌కు అభినందనలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కార్యక్రమాల నిర్వహణ కో ఆర్డినేటర్‌గా సహాయ మంత్రి హోదాలో నియమితులైన పెందుర్తి వెంకటేష్‌కి ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. గుడ్లూరు మయూర్‌కి చిన్నమామ అయిన పెందుర్తి వెంకటేష్‌ను కలసి ఎన్నికల ముందు నుంచి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాల కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. అనంతరం తండ్రి గుడ్లూరు మల్లికార్జున్‌నాయుడు మరియు గుడ్లూరు చెంచురామానాయుడు వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా వెంకటేష్‌ను అభినందించి సత్కరించారు.

## సిఎంను కలసిన గురవారెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై అదేవిధంగా పార్టీ విషయాలపై నాయకులపై ఉన్న అక్రమ కేసులు కార్యకర్తలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందజేసి తంబళ్ళపల్లి నియోజకవర్గ పరిస్థితులను సిఎంకు వివరించారు. అదేవిధంగా ప్రతిపక్షంలో ఐదు సంవత్సరాలు పాటు కష్టపడ్డా కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.





తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం జరిగిన రథోత్సవం, అశ్వవాహనసేవల దృశ్యాలు

ప్రభాతవార్త, తిరుచానూరు

# గూడూరు డివిజన్

## రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోండి

వాకాడు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తాహశీల్దార్ రామయ్య తెలిపారు. మండలంలోని కొండూరు, అందల మాల గ్రామాలలో శుక్రవారం కొండూరు సచివాలయంలోని రెవెన్యూ సదస్సు జరుగుతుందని, ఆ రెండు రెవెన్యూ గ్రామాలలో భూ సమస్యల మీద పరిష్కరించబడతాయని రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

## పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ



గూడూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని స్థానిక త్యాగరాజా వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికీ దాతలుగా డా.తనూజ, మనపాటి విక్టరీ యమ్మ జ్ఞాపకర్థం వారి కుటుంబ సభ్యులు వ్యవహరించి అందజేశారు. ఈ కార్యక్రమానికి డా.రోహిణమ్మ ముఖ్యఅతిథిగా, ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి అనితా సభ్యులు స్నేహలత రెడ్డి ఇంకా రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాసఆచారి పాల్గొన్నారు.

## నేటి నుంచి రెవెన్యూ సదస్సు



గూడూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : డిసెంబర్ ఆరవ తేదీ నుండి జనవరి 7వ తేదీ వరకు గూడూరు డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ప్రజల తన సమస్యలను రెవెన్యూ సదస్సులో తెలియజేయాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా కోరారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల ఏర్పాటుపై డివిజన్ లోని తాసిల్దార్లు ఎంపీడీవోలతో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఏ గ్రామంలో ఎప్పుడు జరిగేది రెండు రోజుల ముందు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని సమస్యలు ఉన్న ఉన్నవారు రెవెన్యూ సదస్సులో తెలియజేస్తే త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మూఢనమ్మకాలపై అవగాహన కల్పించిన జే.వి.వి



గూడూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : బాలాజీ జూనియర్ కాలేజ్ గూడూరు నందు విద్యార్థినీ, విద్యార్థులకు మూఢనమ్మకాల మీద పరీక్ష నిర్వహించి, వారికి ఆర్.ఆర్. జనరల్ మర్చంట్ అధినేత ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంలో విద్యార్థినీ, విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. అనంతరం జే.వి.వి. అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మదనపల్లిలో డాక్టరేట్ పొంది ప్రొఫెసర్లుగా ఉన్నటువంటి తల్లిదండ్రులు వారి ఇద్దరు కూతుర్లను మళ్లీ పుడతారు అనేటువంటి ఒక మూఢనమ్మకంతో వారి చేతులతోనే డంబుల్స్‌తో కొట్టి కిరాతకంగా చంపిన సంఘటన అత్యంత విచారకరమని, మూఢనమ్మకాలకు పరాకాష్ట అని ఇటువంటి వాటిని ఖండించాలని చెప్పారు. ఈ సమాజం బాగుండాలనేటువంటి బాధ్యతని జనవిజ్ఞాన వేదిక వారు 32సంవత్సరాలుగా భారమైనా కానీ బాధ్యతగా భావించామని, కష్టమైనా ఇష్టంగా పని చేస్తున్నామని మీరందరూ కూడా అదే విధంగా మంచి సమాజం కోసం కష్టపడి చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని జన విజ్ఞాన వేదిక అభిలాష అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి.అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, మామదూరు రాధయ్య, ప్రభాకర్, బాలాజీ జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సస్పెండ్ ఆయిన వారిని విధులలోకి తీసుకోవాలి



గూడూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త : గూడూరు ఏ.పీ.ఎస్.ఆర్టీసీ డిపో మేనేజర్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని మానుకోవాలని, అక్రమ సస్పెండ్లను, రద్దు చేయాలని కోరుతూ గూడూరు డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి డి.శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం డిపో ఎదుట స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహించే క్రమంలో జరిగే ప్రమాదాలు, కండక్టర్లు కేసులు పరిష్కరించి న్యాయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో నాయకులు సి.హెచ్.రాము, ఈ. భాస్కర్, కె.కృష్ణ య్య, కె.యస్. సుబ్రహ్మణ్యం, జి.వి.రమణయ్య డి.ఎస్.వాసులు, డి.పి.రావు, పి కిరణ్, సి.ఐ.టి.యు. నాయకులు డి.వెంకట్రామిరెడ్డి, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సవారీగుంట సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 5 ప్రభాతవార్త : వెంకటగిరి పట్టణం 12వ వార్డు సవారీ గుంట ప్రాంతవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్థానికులకు హామీ ఇచ్చారు. వర్షాల సమస్యల కారణంగా సతమతమవుతున్న సవారీ గుంటను ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షం వస్తే ఇళ్లల్లోకి నీరు వస్తున్నట్లు ఎమ్మెల్యేకి స్థానికులు తెలిపారు. గుంటవల్ల నివాసాల్లోకి విష సర్పాలు వస్తున్నాయని, దుర్గంధపూరితమైన వాసన వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ కౌన్సిలర్ విశ్వనాథ్, నీటిపారుదల శాఖ ఏఈ బాబురావు తదితరులు ఉన్నారు.

## ఈ.సి.సి.ఈ.డే నిర్వహించిన సిడిపిఓ

బాలాయపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త : బాలాయపల్లి మండలం వెంగమాంబ పురం అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఈ.సి.సి.ఈ.డే సందర్భంగా సిడిపిఓ శంషాద్ బేగం బాలింతలకు, చిన్నారుల తల్లులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు వివరించారు. పిల్లల చేత పలు జంతువుల ముఖ మాస్కులు ధరించి అభినయ గేయాలు, నాటకీకరణ ప్రదర్శించారు. ఆటపాటలు ద్వారా విద్య నేర్పించడం, సృజనాత్మకత, కథనం, సంసిద్ధత ఇతర బోధన మెళుకువలు తెలియజేశారు. ఈ.సి.సి.ఈ.డే లో గ్రామ కమిటీ సభ్యు లను భాగస్వాములు చేసారు.హెచ్.ఎం. కౌసల్య, అంగన్వాడీ కార్యకర్తలు ఏ.సునీత, బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

**పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు :**

భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ రాంబాబు తెలిపారు. సాయంత్రం వరకు గ్రామాల్లో భూ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తామని చెప్పారు. ఎల్ ఈ సి, భూతగాదాలు,భూ ఆక్రమణ వంటి సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు.

## 18ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఇద్దరు అరెస్టు



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : ప్రకాశం జిల్లా గిద్దలూరు అటవీ ప్రాంతంలో 18ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బా రాయుడు కార్యాచరణతో టాస్క్ ఫోర్సు ఎస్పీ, పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో డీఎస్పీ జీ. బాలిరెడ్డి మార్గనిర్దేశంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పీ.నరేష్ టీమ్ కూంబింగ్ నిమిత్తం కొమరోలు చేరుకున్నారు. అక్కడ నుంచి అటవీ అధికారులు లక్ష్మీ నాయక్, జమాల్ వల్లిలతో కలసి గిద్దలూరు డివిజన్ చింతలపల్లి వైపుగా కూంబింగ్ చేపట్టారు. అక్కడ కనుమబావి రస్తా వద్ద కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పట్టుబడ్డ వారిని ప్రకాశం జిల్లా వాసుగా గుర్తించారు. దుంగలతో పాటు, ఇద్దరు వ్యక్తులను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**

**- మెగా జాబ్ మేళాకు విశేష స్పందన, 127మంది ఉద్యోగాలకు ఎంపిక**

కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త : రాష్ట్రంతో పాటు కుప్పం నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం తెదేపా కార్యాలయంలో గురువారం ఎపిస్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా 256మంది యువత ఇంటర్వ్యూలకు హాజరు కాగా 127మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి నియామకపత్రాలు అందించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో రాగానే సిఎం చంద్రబాబునాయుడు మెగా డిఎస్సీ నిర్వహణ ఫైలుపై తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పంలో నిరుద్యోగ యువత నైపుణ్య సామర్థ్యంలో కొంత వెనుకబడి ఉన్నారన్నారు. వారికి శిక్షణల ద్వారా పూర్తి స్థాయిలో ఉద్యోగాల కల్పనకు తాము కృషి చేస్తామన్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రొఫెషనల్ విభాగం ఉపాధ్యక్షుడు డా॥ వెంకటేష్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, నేతలు కన్నన్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.